WANTED REPORTERS
నవతరం తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteluguidaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 215 సోమవారం, ఆగస్టు 03, 2026, పేజీలు - 4 వెల: 5/-

### ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అనడమే

## కాంగ్రెస్ విధానమా



**హైదరాబాద్, ఆగస్టు 2 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (ఆదివారం) లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఇంజినీర్లను 'క్రిమినల్ వేస్ట్' అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామెంట్స్‌పై ఈ లేఖ రాసినట్లు చెప్పుకొచ్చారు. ఒకవైపు భారతదేశ ఇంజినీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతుంటే, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతుంటే.. అలాంటి వారిని 'క్రిమినల్ వేస్ట్' అని రేవంత్‌రెడ్డి అనడం తగదని అన్నారు. దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షల మందికి ఉద్యోగ ఉపాధిని అందిస్తున్న ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు. సీఎం చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ఈ అంశంలో మౌనంగా ఉండటమంటే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సమర్థించినట్లేనని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డితో వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. యువత రేపటి భారతదేశ నిర్మాతలు అనే విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలని అన్నారు. యువతతో పెట్టుకుంటే ఏమైందో రాహుల్ గాంధీ నానమ్మకి, ఇందిరమ్మ ఎమర్జెన్సీ సమయంలో, యుపీఏ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలుసునని ప్రస్తావించారు. యువత తలుచుకుంటే ఆ పార్టీ మెడలు ఎలా వంచుతారో రాహుల్ గుర్తుంచుకోవాలని అన్నారు. తెలంగాణ యువత ఓట్లు అడిగి వారిని మభ్యపెట్టిన రాహుల్ గాంధీకి తన నైతిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ లేఖ రాస్తున్నానని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత, యువతకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలపైన మాట్లాడే అర్హత కోల్పోయారని విమర్శించారు. యువత గురించి రాహుల్ గాంధీ చెప్పే ఊకదంపుడు ప్రసంగాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి విద్యార్థులను, ఇంజినీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నారని ప్రస్తావించారు. దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా? అని ప్రశ్నించారు. తెలంగాణ యువత కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తున్న అడ్డమైన వ్యాఖ్యలను గమనిస్తోందని అన్నారు.

### నామినేటెడ్ పోస్టులకు

## రంగం సిద్ధం



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు అధికారికంగా వేగం పుంజుకుంది. గాంధీభవన్‌లో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి సుదీర్ఘంగా సమావేశమై నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాలు, విధివిధానాలను ఖరారు చేశారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) డైరెక్టర్లు, ఛైర్మన్ల పదవులతో పాటు మార్కెట్ కమిటీలు, దేవస్థాన కమిటీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఇతర కీలక నామినేటెడ్ పోస్టులను త్వరితగతిన, పారదర్శకంగా భర్తీ చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడిన వారికి ఈ పదవుల్లో పెద్దపీట వేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

### డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను

## కాపాడాలి



**న్యూ ఢిల్లీ :** భారత్ లక్ష్య సాధనలో యువత ఆరోగ్యమే అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్"లో భాగంగా చేపట్టిన మాదకద్రవ్య రహిత యువత కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని డ్రగ్స్ రహిత సమాజం దేశాభివృద్ధికి ఎంత అవసరమో వివరించారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంబమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం ఓ వ్యక్తి కోసమో, ఓ కుటుంబం కోసమో కాదని వాటన్నింటికి మించి దేశం కోసమని ప్రధాని మోదీ తెలిపారు. దేశం 'వికసిత్ భారత్' దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా, ఆత్మ విశ్వాసంతో ఉండటమే కాకుండా డ్రగ్స్ లాంటి మహమ్మారులకు దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని సూచించారు. మాదక ద్రవ్యాల స్మగ్లర్లు, డ్రగ్స్? దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోదీ చెప్పారు. అరెస్టులు గణనీయంగా పెరిగాయని, వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డ్రగ్స్? వినియోగం వల్ల కలిగే తాత్కాలిక ఉత్సాహం మీ కెరీర్, వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తుందని అన్నారు. దేశ యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, ఇందుకోసం అన్ని రకాల డ్రగ్స్? వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

### అలా హామీ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ..

## లేకుంటే తప్పుకుంటా



**సికింద్రాబాద్:** వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంక టరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తన సొంత నియోజకవర్గం నల్లగొండలోని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన నియోజకవర్గ ఓటర్లకు ఓ కండిషన్ పెట్టారు. వచ్చే ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మాట ఇస్తేనే తాను పోటీలో ఉంటానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ స్పష్టమైన హామీ రాకుంటే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుం టానని ప్రకటించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీశారు. స్వయంగా తాను ఎన్నికల ప్రచారానికి రాకపోయినా, ఇప్పటి వరకు నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ క్రమంలో తన రాజకీయ జీవితం, సొంత ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, పలుసార్లు మంత్రిగా ఉన్నపటికీ తనకు సొంత ఇల్లు, భారీగా ఆస్తులు లేవని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నానని, తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తుల తప్ప తాను సొంతంగా సంపాదించుకున్నవి లేవని పేర్కొన్నారు. నల్లగొండ అభివృద్ధే తన ధ్యేయమని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తానని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

### ఏపీ ప్రభుత్వం-ఆస్ట్రేలియా మధ్య

## 4 కీలక ఒప్పందాలు



**అమరావతి :** ఏపీ ప్రభుత్వం, ఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్యా, పరిశోధన, పారిశ్రామిక సంస్థల మధ్య క్లీన్ ఎనర్జీ, సమ్మిళిత విద్య, మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఇటీవల మంత్రి లోకేశ్ జరిపిన ఆస్ట్రేలియా పర్య టనలో భాగంగా అక్కడి ప్రతినిధులను ఆహ్వానించి, రాష్ట్రంలో ఉన్న రాయితీల ను వివరించిన ఫలితంగా ఈ చారిత్రాత్మక భాగస్వామ్యం సాధ్యమైంది. ఈ మేరకు ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్, ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఈ ఎంవోయూలపై ఇరుపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల్లో భాగంగా విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, ఐఐటీ తిరుపతి, సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ సంయుక్తంగా ఐఐటీ తిరుపతిలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ పీవీ తయారీ, సోలార్ ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ పరిశోధనలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా యూఎన్ఎస్‌డబ్ల్యూ విద్యా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తుంది.



# “ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి జనాభా దామాషా పద్ధతిలో బడ్జెట్ లో పక్కదారి మళ్లింపు ప్రధాన కారణం”

- ఉద్దానం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే రాష్ట్ర బడ్జెట్లో న్యాయంగా దక్కవలసిన నిధులు కేటాయిస్తే చాలు
- జగన్ గారే 200 పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు శంకుస్థాపన, ప్రారంభం చేశారు
- మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు కృషితోనే ఆస్పత్రి సాధ్యమైంది
- 700 కోట్ల సుజల ధార పనులు 85% పూర్తయ్యాయి
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి తమిళనాడు తరహా అధికార వికేంద్రీకరణ అవసరం
- ప్రతి ఏడాది మూడు లక్షల మంది యువత వలసలు
- పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు





**పలాస-కాశీబుగ్గ డేట్‌లైన్**
ఆంధ్రప్రదేశ్‌కు ఉత్తరాన ఒడిశా సరిహద్దులో ఉన్న ఉత్తరాంధ్ర అంటే శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు. ప్రకృతి సంపద, వంశధార, నాగావళి, బహుద, మహేంద్రతనయ వంటి నాలుగు నదులు, 300 కిలోమీటర్ల సముద్ర తీరం ఉన్నా ఈ ప్రాంతం నేటికీ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది. సుదీర్ఘకాలం పరిపాలించిన తెలుగుదేశం ప్రభుత్వంతో పాటు, ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా దామాషా పద్ధతిని పాటించకుండా నిధులను ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి స్తంభించింది.
రాష్ట్ర జనాభాలో 10% ఉన్న ఉత్తరాంధ్రకు బడ్జెట్‌లో కనీసం 5% నిధులు కూడా రావడం లేదు. ఫలితంగా శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతం కిడ్నీ సమస్యలతో, శాశ్వత వలసలతో, సాగునీటి కొరతతో అల్లాడుతోంది. ఈ నేపథ్యంలో ఉద్దానం సమస్యలు, శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుతనం, పురపాలక అభివృద్ధిపై నవతరం దినపత్రికతో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు.
ప్రశ్న: ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా, ప్రత్యేకంగా ఉద్దానం ప్రాంతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలు ఏమిటి?
జవాబు: మూడు ప్రధాన సమస్యలు ఉన్నాయి. మొదటిది నీరు. మంచి తాగునీరు లేకపోవడమే మా ప్రాంతానికి శాపం. గత 20 ఏళ్లుగా ప్రజలు ఫ్లోరైడ్, ఇతర లవణాలు ఉన్న బోర్ల నీరు తాగుతున్నారు. దాని ఫలితమే ఉద్దానం కిడ్నీ సమస్య. ప్రతి ఇంట్లో ఒక కిడ్నీ బాధితుడు ఉన్నాడు. రెండోది ఉపాధి. యువతకు ఇక్కడ ఉద్యోగాలు లేవు. మూడోది సాగునీరు. వంశధార, నాగావళి పక్కనే ప్రవహిస్తున్నా రైతుకు నీరు అందడం లేదు. పట్టణాల్లో డ్రైనేజీ, రోడ్లు, చెత్త సేకరణ సమస్యలు కూడా ఉన్నాయి.ప్రశ్న: ఉద్దానం ప్రాంత అభివృద్ధిపై గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును ఎలా చూస్తారు?
జవాబు: ఉద్దానం ప్రాంతం సుదీర్ఘకాలం పాలించిన ప్రభుత్వాలలో టిడిపి ప్రభుత్వం కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా టిడిపి భాగస్వామ్యం ఉంది. కానీ గత రెండేళ్ల నుంచి శాశ్వతమైన అభివృద్ధి కార్యక్రమాలు ఏమి కార్యరూపం దాల్చలేదు.
ఒక ప్రాంత అభివృద్ధికి వ్యవసాయం, సాగునీటి వనరులు, పారిశ్రామిక అభివృద్ధి కొలమానంగా చెప్పవచ్చు. ఈ మూడింటిలో కూటమి ప్రభుత్వం హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. సుజల ధార, వంశధార స్టేజ్-2 వంటి సాగునీటి ప్రాజెక్టులు ఆగిపోయాయి. పలాస ప్రాంతాల్లో కొత్త పరిశ్రమలు రాలేదు. వ్యవసాయానికి రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలు నిలిచిపోయాయి. ఇదే మా ప్రాంత వెనుకబాటుకు నిదర్శనం.
ప్రశ్న: “ఉత్తరాంధ్ర” అనే పేరుపై, ఈ ప్రాంత చరిత్రపై మీ అభిప్రాయం ఏమిటి?
జవాబు: ఉత్తరాంధ్ర అంటూ నాడు కొందరు ఆంధ్ర పెద్దలు తమ ప్రాంతంపై పెత్తనం చేశారు. వాస్తవానికి ఒడిస్సా రాష్ట్రం నుంచి విడిపోయిన తర్వాత ఉద్దానం నిర్లక్ష్యానికి గురికాబడింది. మా సంస్కృతి, భాష, చరిత్ర అన్నీ కళింగ సంప్రదాయానికి చెందినవి. కాబట్టి మా డిమాండ్ ఒకటే. తమ ప్రాంతానికి కళింగ సీమ అనే నామకరణం చేయాలి. ఆంధ్ర పెత్తందారులు పాలకులుగా మోసపుచ్చుతూ ఉన్నారు. కేవలం ఓటు బ్యాంకు పరంగా వాడుకోవడమే తప్ప ఉద్దానం ప్రాంత అభివృద్ధిని ఏనాడు వారు కాంక్షించలేదు. మాకు జరిగిన అన్యాయాన్ని భవిష్యత్ తరం చూస్తూ ఊరుకోదు.
ప్రశ్న: శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుతనానికి ప్రధాన కారణాలు ఏమిటి?
జవాబు: ప్రధాన కారణం బడ్జెట్‌లో పక్కదారి మళ్లింపు. రాష్ట్ర జనాభాలో శ్రీకాకుళం జిల్లా వాటా 5.5%. కానీ గత టీడీపీ ప్రభుత్వంలో గానీ, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో గానీ జనాభా దామాషా ప్రకారం ఒక్క రూపాయి కూడా రావడం లేదు. అన్ని నిధులు అమరావతి, గోదావరి డెల్టాకు తరలిస్తున్నారు.

రెండోది పరిశ్రమల లేమి. జిల్లాలో పెద్ద పరిశ్రమలు లేవు. మూడు నదులు ఉన్నా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. నాలుగు విద్య, వైద్య రంగంలో జాతీయ సంస్థలు లేవు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు, రఘురాం రాజన్ కమిటీ సిఫార్సులు అమలు కాలేదు. దీనివల్ల ప్రతి ఏడాది 3 లక్షల మంది యువత గుజరాత్, కేరళ, హైదరాబాద్‌కు వలస వెళ్తున్నారు. శ్రీకాకుళం వలసలకు అడ్డాగా మారింది.
ప్రశ్న: పలాసలో 200 పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఇప్పుడు ఏ స్థితిలో ఉంది?
జవాబు: ఉద్దానం బాధితుల కన్నీళ్లు చూసి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారే 2019లో పలాసలో 200 పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మరియు ఆసుపత్రిలికి శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవం కూడా ఆయనే చేశారు. ఈ ప్రాజెక్ట్ సాధ్యం కావడానికి అప్పటి రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి లిడాక్టర్ సిదిరి అప్పలరాజు గారి కృషి చాలా ఉంది. ఆయన రోజూ ఫాలోఅప్ చేసి నిధులు తెప్పించారు.
ఆస్పత్రి భవనం సిద్ధమై ప్రారంభమైంది. కానీ ఇప్పుడు అసలు సమస్య సిబ్బంది, పరికరాల కొరత. అవసరమైన డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు లేరు. డయాలసిస్ మిషన్లు, కిడ్నీ మార్పిడికి కావాల్సిన పరికరాలు సరిపడా లేవు. దీనివల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో ఉచిత సేవలు అందడం లేదు. ప్రతి రోజు 15-20 మంది కొత్త బాధితులు ఇంకా శ్రీకాకుళం రిమ్స్‌కే వెళ్తున్నారు.
ప్రభుత్వం వెంటనే తగినంత సిబ్బంది నియమించి, అన్ని పరికరాలు సమకూర్చి ఈ ఆస్పత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి. ఇది ఉద్దానం ప్రజలకు ప్రాణాధారం.
ప్రశ్న: 700 కోట్ల వంశధార సుజల ధార ప్రాజెక్ట్ ప్రస్తుత స్థితి ఏమిటి?
జవాబు: ఇది కూడా జగన్ గారి హయాంలోనే మొదలైంది. వంశధార నది నుంచి 150 మీాణ నీటిని తీసి పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, మందస మండలాల్లోని 2.5 లక్షల ఇళ్లకు ఇంటింటా నల్లా ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వడం దీని లక్ష్యం. మేము అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 85% పనులు పూర్తి చేశాం. పైప్‌లైన్, ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి.
కానీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగతా 15% పనులు నిలిచిపోయాయి. నిధులు విడుదల చేయడం లేదు. మిగతా పనులు కూటమి ప్రభుత్వం పూర్తిచేస్తే గాని శుద్ధి చేయబడిన వంశధార నదీ జలాలు సరఫరా చేయలేం కదా. కిడ్నీ ఆస్పత్రి ఉన్నా, తాగే నీరు స్వచ్ఛంగా లేకుంటే ఉద్దానం సమస్యకు పరిష్కారం ఉండదు. ప్రభుత్వం వెంటనే మిగిలిన నిధులు విడుదల చేసి 6 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేయాలి. లేకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం.
ప్రశ్న: వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, వై.ఎస్. జగన్ హయాంలలో శ్రీకాకుళం జిల్లాకు ఏమేం వచ్చాయి?
జవాబు: ఈ రెండు హయాంల్లోనే జిల్లాకు నిజమైన అభివృద్ధి జరిగింది.
వైయస్ఆర్ గారు: 2008లో శ్రీకాకుళంలో రిమ్స్ వైద్య కళాశాల ఇచ్చారు. ఎచ్చెర్లలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ క్యాంపస్ ఇచ్చారు. వంశధార స్టేజ్-1 ప్రాజెక్ట్ పూర్తి చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించారు.
జగన్ గారు: పలాసలో 200 పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 700 కోట్ల సుజల ధార ప్రాజెక్ట్ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1125 గ్రామ సచివాలయాలు, 328 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాడు-నేడు కింద 1200 స్కూళ్లు బాగు చేశారు. వైయస్ఆర్ రైతు భరోసా కింద రైతులకు ఏడాదికి 13,500 ఇచ్చారు. ఈ పథకాల వల్లే కరోనా సమయంలో మా జిల్లా గట్టెక్కింది. కానీ గత 2 ఏళ్లుగా ఈ పథకాలన్నీ నిలిచిపోయాయి.
ప్రశ్న: మీరు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం చైర్మన్‌గా ఉన్నప్పుడు ఏం చేశారు?
జవాబు: మేము అధికారంలో ఉన్న 5 ఏళ్లు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిద్దాలని ప్రయత్నించాం. సచివాలయాల ద్వారా ఇంటి దగ్గరే సేవలు అందించాం. పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాం. ప్రధాన రోడ్లకు లైట్లు, సీసీ రోడ్లు వేశాం.
ప్రశ్న: శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి, కళింగ సీమ భవిష్యత్తుకు మీ సూచనలు ఏమిటి?
జవాబు: ఉద్దానం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే రాష్ట్ర బడ్జెట్లో న్యాయంగా దక్కవలసిన నిధులు కేటాయిస్తే చాలు. అంతేకాదు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అధికార వికేంద్రీకరణ తమిళనాడు రాష్ట్రం వలె నమూనా ఉండాలి.
అక్కడ చెన్నై ఒక్కటే అభివృద్ధి కాకుండా కోయంబత్తూర్, మదురై, తిరుచి వంటి ప్రాంతాలకు సమానంగా నిధులు, అధికారాలు ఇచ్చారు. అదే తరహాలో మన రాష్ట్రంలో కూడా అమరావతికి మాత్రమే కాకుండా ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక అభివృద్ధి బోర్డులు ఇచ్చి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఇవ్వాలి.
శివరామకృష్ణ కమిటీ, శ్రీకృష్ణ కమిటీ సిఫార్సులు మేర తమ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో తగినంత వాటా కేటాయించకపోతే, కళింగ సీమ కోసం మరో పోరాట ఉద్యమం కార్యరూపం దాల్చక మానదు.
అదనంగా ఐదు పనులు వెంటనే చేయాలి.
ఒకటి సుజల ధార, వంశధార స్టేజ్-2 ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.
రెండు పలాస కిడ్నీ ఆస్పత్రిలో సిబ్బంది, పరికరాలు పెంచి పూర్తి స్థాయిలో సేవలు అందించాలి.
మూడు పలాస ప్రాంతానికి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. ఉన్నత విద్య కోసం పిల్లలు విజయనగరం, విశాఖ వెళ్లాల్సిన పరిస్థితి ఉండకూడదు.
నాలుగు పలాసలో ఫుడ్ ప్రాసెసింగ్, సీఫుడ్ పరిశ్రమలు, బారువాలో వాడరేవు నిర్మాణం చేపట్టాలి.
ఐదు కళింగ సీమకు ప్రత్యేక పారిశ్రామిక కారిడార్ ఇవ్వాలి. ఇవి చేస్తేనే వలసలు ఆగుతాయి.
ప్రశ్న: చివరిగా ప్రభుత్వానికి మీ సందేశం?
జవాబు: ప్రభుత్వానికి చెప్పేది ఒకటే. రాజకీయ కక్షలు పక్కన పెట్టండి. ఉద్దానం ప్రజల ప్రాణాలు కాపాడండి. సుజల ధార పూర్తి చేసి, కిడ్నీ ఆస్పత్రిని పూర్తి స్థాయిలో నడపండి. జనాభా దామాషా నిధులు ఇవ్వండి. అధికార వికేంద్రీకరణ ద్వారా కళింగ సీమకు స్వయం నిర్ణయాధికారం ఇవ్వండి. “నది ఉంటేనే నాగరికత. నీళ్లు ఇస్తేనే కళింగ సీమ బతుకుతుంది”. ఈ మాటను ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.

# అమ్మవారికి బోనం సమర్పించిన మనాలి ఠాకూర్

:- రామగుండం ప్రజల సంక్షేమం కోసం ఆలయంలో ప్రత్యేక పూజలు



**రామగుండం,ఆగస్టు 2**
రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వారి సతీమణి మనాలి ఠాకూర్ ఆదివారం గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలోని శ్రీ పెద్దమ్మ తల్లి నాగదేవతా దేవాలయంలో నిర్వహించిన ఆషాడమాస బోనాల మహోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని,ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు.బోనాల వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్నేహితుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మనాలి ఠాకూర్



**రామగుండం,ఆగస్టు 2**
రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వారి సతీమణి మక్కన్ సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ ఆదివారం అంతర్గం మండల కేంద్రంలో నిర్వహించిన స్నేహితుల దినోత్సవ (ఫ్రెండ్షిప్ డే ) వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన యువత,ప్రజలు,నాయకులు,కార్యకర్తలను ఆప్యాయంగా కలుసుకుని వారికి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.సమాజంలో స్నేహబంధం,పరస్పర సహకారం,ఐకమత్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ “స్నేహం అనేది మనిషి జీవితంలో అత్యంత విలువైన బంధం.కష్టసుఖాల్లో తోడుగా నిలిచి ధైర్యాన్ని ఇచ్చేది నిజమైన స్నేహితుడే.ప్రేమ, నమ్మకం,పరస్పర గౌరవంతో కూడిన స్నేహబంధాలు సమాజంలో ఐక్యతను, మానవీయ విలువలను మరింత బలోపేతం చేస్తాయి” అని పేర్కొన్నారు.అంతేకాకుండా ప్రతి ఒక్కరూ మంచి స్నేహబంధాలను పెంపొందించుకుని,పరస్పరం సహకరించుకుంటూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్గం మండల కేంద్రంలోని నిరుపేద మహిళల ఉపాధి కోసం మక్కన్ సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ కానుకగా 15 కుట్టు మిషన్లను అందజేస్తామని మనాలి ఠాకూర్ హామీ ఇచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువజనులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మిర్యాల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు




**పెద్దపల్లి,ఆగస్టు 2 :**
లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్,ప్రముఖ కార్మిక నాయకుడు,టిబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లయన్ మిర్యాల రాజిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మిర్యాల రాజిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.అనంతరం క్లబ్ అధ్యక్షురాలు డా.శరణ్య యాదవ్ లయన్స్ క్లబ్ బ్రాడ్జ్ ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన సేవా దృక్పథం, నాయకత్వం,సమాజం పట్ల ఉన్న అంకితభావాన్ని సభ్యులు కొనియాడారు.ఈ సందర్భంగా డా.శరణ్య యాదవ్ మాట్లాడుతూ మిర్యాల రాజిరెడ్డి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూనే సమాజ సేవలో విశేష సేవలందిస్తున్నారని అన్నారు. సమాజ సేవతో పాటు కార్మిక సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న ఆయన సేవా స్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భగవంతుడు ఆయురారోగ్యాలు,ఆనందం, ఐశ్వర్యం ప్రసాదించి మరెన్నో సంవత్సరాలు సమాజానికి సేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కాటం సత్యం, కోశాధికారి టివి సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్మూరి శ్రీనివాస్,మేకల మారుతి క్లబ్ చైర్‌పర్సన్,ఉమ్మడి కమాన్ పూర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి లు పాల్గొని మిర్యాల రాజిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించగా సభ్యులు ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ఒంటరి జీవితానికి గ్రామం అండగా... నాగినేనిపల్లిలో మానవత్వం చాటిన గ్రామపంచాయతీ

**నాగినేని పల్లి ఆగస్టు02** యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామానికి చెందిన నాయిని భీమయ్య యాదవ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఆయన మరణం గ్రామస్థులను విషాదంలో ముంచెత్తింది.భీమయ్య యాదవ్‌కు అంత్యక్రియలు నిర్వహించడానికి సమీప బంధువులు ఎవరూ లేకపోవడంతో, గ్రామపంచాయతీ పాలకవర్గం మానవత్వాన్ని చాటింది. సర్పంచ్ బట్కేరి జ్యోతి బీరప్ప ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి అన్ని ఏర్పాట్లు చేసి, హిందూ సంప్రదాయాల ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, ఆపదలో అనాథలా మిగిలిపోయిన వ్యక్తికి గ్రామపంచాయతీ అండగా నిలిచి చివరి వీడ్కోలు పలకడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి మనిషికి గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని, నాగినేనిపల్లి గ్రామపంచాయతీ చూపిన



మానవతా దృక్పథం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.భీమయ్య యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు..

# బీహెచ్ఈఎల్‌లో ఘనంగా బెస్త గంగపుత్ర సంఘం బోనాల వేడుకలు

**- పాల్గొన్న భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి**






**రామచంద్రాపురం, ఆగస్ట్ 02:** ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా రామచంద్రాపురం పరిధిలోని బీహెచ్ఈఎల్‌లో బెస్త గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం బెస్త గంగపుత్ర సంఘం సభ్యులు సంప్రదాయబద్ధంగా బోనాల ఊరేగింపు నిర్వహించి, బీహెచ్ఈఎల్ పెద్దమ్మ తల్లి ఆలయానికి బయలుదేరారు. అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెస్త గంగపుత్ర సంఘం సభ్యులు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, కృష్ణారావు, మదన్, ప్రవీణ్, శ్రీధర్‌తో పాటు భక్తులు, స్థానిక ప్రజలు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆందోల్ నియోజకవర్గానికి రూ.19.15 కోట్లతో 9 బీటీ రోడ్లు మంజూరు

**- మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో అభివృద్ధికి మరో కీలక అడుగు**

**మెదక్ టుడే న్యూస్. 2**

ఆందోల్: ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడిందని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ ఈ. రాంబాయి తెలిపారు. మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు రూ.19.15 కోట్ల అంచనా వ్యయంతో 9 బీటీ రోడ్లు మంజూరు కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.మొత్తం 22.50 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామాలు, తండాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఆందోల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం అభినందనీయమని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని సర్పంచ్ ఈ. రాంబాయి అన్నారు. రోడ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని ఆమె కోరారు.ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి దామోదర్ రాజనర్సింహ చేస్తున్న కృషికి వెంకటాపూర్ గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ ఈ. రాంబాయి కృతజ్ఞతలు తెలిపారు.




# స్నేహం కన్నా గొప్పది లేదు.. జీవితాంతం నిలిచే ఆత్మీయబంధం



**రాయపోల్, ఆగస్టు 02:** జీవితంలో స్నేహం కన్నా గొప్పది మరొకటి లేదని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ (అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం, సయ్యద్ నగర్ తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన తన చిన్ననాటి స్నేహితులను పలకరించి వారికి శాలువాతో సన్మానించారు.చిన్ననాటి స్నేహితులను కలిసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.. స్నేహం అనేది రక్తసంబంధంకాదని.. కానీ జీవితాంతం నిలిచే ఆత్మీయబంధమని పేర్కొన్నారు.మన సంతోషంలో నవ్వుతూ, కష్టాల్లో అండగా నిలుస్తూ, ప్రతి అడుగులో తోడుగా ఉండేవారే నిజమైన స్నేహితులని ఆయన అన్నారు.మానవ జీవితాన్ని అందంగా మార్చిన ప్రతి స్నేహితుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు మాజీ ఎమ్మెల్సీ. స్నేహితులంటే తనకు ఎంతో ప్రాణమని. స్నేహితులు ఆపదల ఉంటే రాత్రింబవళ్లు అందుబాటులో ఉండి సేవ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంప మహేందర్, సికిందర్, దౌల్తాబాద్.. రాయపోల్ ఉమ్మడి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకింది మంజూరు, ఫారుక్ హుస్సేన్ స్నేహితులు పాల్గొన్నారు

# డాక్టర్ సీదిరి అక్రమ అరెస్ట్‌తో కూటమిపై వ్యతిరేకత పెరుగుతోంది

**- ఎంపీపీ డొక్కరి దానయ్య**

**- మందస మండల వైసీపీ క్లస్టర్ సమావేశంలో కార్యాచరణ ప్రకటన**



**మందస** మందస: రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులిను అక్రమంగా కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించి జైలుకు పంపించిన తీరుపై ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, అప్పలరాజుకు రోజురోజుకు సానుభూతి పెరుగుతోందని వైఎస్సార్సిపి సీనియర్ నాయకులు, మందస ఎంపీపీ లిడొక్కరి దానయ్య యాదవ్ ఆదివారం పితాతొలి గ్రామంలో జరిగిన వైఎస్సార్సిపి సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు.ఉద్దానం ప్రాంతంలో 200 పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 700 కోట్ల సుజల ధార వంటి ప్రాజెక్టులను తీసుకొచ్చి ప్రజా సేవ చేసిన నాయకుడిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దారుణమని ఆయన విమర్శించారు. “ప్రజల కోసం పనిచేసిన నాయకుడిని వేధిస్తే ప్రజలు ఊరుకోరు. ఇదే అంశం రాబోయే రోజుల్లో కూటమికి తిరుగులేని పాఠం చెబుతుంది” అని హెచ్చరించారు.

**పోరాట కార్యాచరణ ప్రకటన**

ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఒకటి: రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు లిడీఎస్సీ టీచర్ల పోస్టుల నియామకంలో జరుగుతున్న అక్రమాలలిపై పలాస నియోజకవర్గ కేంద్రంలో జరిగే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తీర్మానించారు.

రెండు: డాక్టర్ సీదిరి అక్రమ అరెస్ట్‌ను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించేందుకు రచ్చబండ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ అక్రమాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.వైఎస్సార్సీపి యువజన నాయకులు సేనాపతి కిషోర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆరోపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో అక్రమాలు జరిగాయని, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. యువతను రాజకీయాల్లోకి రప్పించి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సీదిరి అరెస్ట్‌ను యువత పెద్ద ఎత్తున ఖండించాలని కోరారు.

**పోలీసుల ద్వంద్వ వైఖరిపై ఆగ్రహం**

మందస మండలంలో వైఎస్సార్ సీపీ చేపడుతున్న కార్యక్రమాలను పోలీసులు కావాలనే అడ్డుకుంటున్నారని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార టీడీపీ కార్యక్రమాలకు వెంటనే అనుమతులు ఇస్తున్న పోలీసులు, ప్రతిపక్ష పార్టీ కార్యక్రమాలకు మాత్రం అనుమతులు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, వెంటనే ఈ ద్వంద్వ వైఖరిని వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందజేస్తామని, అవసరమైతే ధర్నాలు, నిరసనలు చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, చింతాడ గణపతి, బాడ జగన్, డాక్టర్ జయరాం, పుల్లారి పితాంబరం, మడియా రామకృష్ణ, బత్తిన లక్ష్మణ్, దున్న హరికృష్ణ, బేపలి తిరుపతి రెడ్డి, మట్ట షన్ముఖరావు, అంబుగాం సర్పంచ్, జిల్లుండ పాపారావు, రాజాన శివాజీ తో పాటు పలువురు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జన్మదినం సంబంధించిన బర్త్ డే ఫ్రేమ్ అందజేత

- పూరీ తీరాన సైకత శిల్పంను ఏర్పాటు చేసిన చిర్రా రవీందర్ యాదవ్
- సైకత శిల్పం చిత్ర పటాన్ని కేటీఆర్ కి అందించిన చిర్రా రవీందర్ యాదవ్
- రవీందర్ యాదవ్ పై ప్రశంసలు కురిపించిన వర్కింగ్ ప్రెసిడెంట్
- శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చ
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో వచ్చే ప్రతి ఎన్నికల్లో భారాసదే విజయం
- శేరిలింగంపల్లి ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ ధీమా






**శేరిలింగంపల్లి, నవతరం:** భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో శేరిలింగంపల్లి ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ నందినగర్ లోని ఆయన నివాసంలో ప్రత్యేకంగా కలిశారు. మర్యాదపూర్వక సమావేశంలో కేటీఆర్ కి సైకత శిల్పంతో కూడిన చిత్ర పటాన్ని అందించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ పూరీ తీరాన సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి బర్త్ డే విషెస్ తెలిపారు. అందుకు సంబంధించిన ఫోటో ఫ్రేమ్ ను కేటీఆర్ కి అందించారు. ఫోటో ఫ్రేమ్ తో పాటు సైకత శిల్పం విషయాలను వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్, చిర్రా రవీందర్ యాదవ్ పై ప్రశంసలు కురిపించారు. బాగుందని కితాబిచ్చారు. అలాగే శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలను సైతం చర్చించారు. పార్టీ బలోపేతంకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో భారాసను గెలిపించుకొని తీరుతామన్నారు. ఎంత మంది నేతలు పార్టీలు మారినా భారాసకు తిరుగులేదని, యువ నాయకత్వంతో ముందుకు సాగుతున్నామని, జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా బలోపేతం జరుగుతుందని వెల్లడించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేస్తామని వెల్లడించారు.

# హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు..

- కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు
- హైడ్రాకు సంఘీభావం తెలుపుతూ నగరంలో పలు సంక్షేమ సంఘాల ర్యాలీలు
- వరద కట్టడి, చెరువుల పరిరక్షణ చర్యలను స్వాగతించిన నగరవాసులు
- రెండేళ్లలో రూ. 1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిందని ప్రశంసలు
- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తూ.. హైడ్రాను కొనసాగించాలని డిమాండ్
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి




**హైదరాబాద్, నవతరం:** నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘హైడ్రా’కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి. గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు. కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు. ఇటీవల, హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలంటూ తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, నేటి ప్రజా ర్యాలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# నిర్మాణదారుడి బరితెగింపు





- నాలాను ఆక్రమించి భవన నిర్మాణం
- అనుమతులతో పనేనటంటూ మున్సిపల్ అధికారులకు సవాలు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానిక ప్రజలు

**కుత్బుల్లాపూర్, నవతరం:** అసలే ఆక్రమణల పర్వం.. అందులోనూ కాలువలు ఆక్రమిస్తూ నిర్మాణాలు. సరేలే.. పేదవారు ఏ రేకుల ఇండ్ల నిర్మాణాలో తాత్కాలికంగా నిర్మించుకున్నారు, హైడ్రా లాంటి సంస్థల దృష్టికి వెళ్లిందంటే వాటిని తొలగిస్తారు అనే భయం లేదు. అందులోనూ పూర్తి శాశ్వత నిర్మాణాలు, గ్రౌండ్ ఫ్లోర్ అదనంగా రెండు అంతస్తులు నిర్మాణం. స్థానికంగా ఎవరైనా ఏంటి మరి పూర్తిగా మోరీని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారు అంటే.. అదేం భయం లేదు, మాకు స్థానిక రాజకీయ నాయకుల మద్దతు ఉంది. మున్సిపల్ అధికారులను చూసుకున్నామంటూ అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నారు ఇక్కడి భవన నిర్మాణదారులు. ఇదంతా ఎక్కడో మారుమూల గ్రామంలో కాదు కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ లోని ఫాక్స్ సాగర్ కు ఉన్న గొలుసుకట్టు కాలువ పక్కనే వెలుస్తున్న అక్రమ నిర్మాణాల భాగోతం. సుభాష్ నగర్ నుండి కొంపల్లి సీఎంఆర్ స్కూల్ కు వెళ్ళే దారిలో ఎడమవైపు నాలాను ఆక్రమించి బఫర్ జోన్ లో దర్జాగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణం కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. ఇకనైనా ఫాక్స్ సాగర్ నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న సదరు బహుళ అంతస్తుల భవనం పై తగిన చర్యలు తీసుకుంటే బాగుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు తలసాని



సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకల్లో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తలసానికి స్వాగతం పలికారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఓం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పుష్కలంగా వర్షాలు కుంవాలని పంటలు పాడిపంట చల్లగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. తెలంగాణసంస్కృ తి,సాంప్రదాయా లకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని పేర్కొ న్నారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారని చెప్పారు.సమైక్య రాష్ట్రంలో బోనాల పండును పట్టిం చుకోలేదని తలసాని గుర్తుచేశారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ ఉన్నప్పటికీ చేయలేదని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్రపండు గగా ప్రకటించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం లో మహంకాళి అమ్మవారి కి బంగారు బోనం సమర్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.గోల్కొండ నుంచి లాల్‌దర్వాజ వరకు అంగరంగ వైభవంగా బోనాలు జరిపించారని పేర్కొన్నారు. లక్షలాది గా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా నెల రోజుల నుండి అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి భక్తులకు 100 సంవత్సరాల నుండి డెక్కన్ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో సేవలు అందిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

## లష్కర్ బోనాల జాతర షురూ

### ఉజ్జయిని మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**హైదరాబాద్:** లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా ప్రార ంభమయ్యాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పి ంచేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయానికి వస్తున్న భక్తులతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.ఇదిలా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాధారణ భక్తుల కోసం మూడు క్యూలైన్లు, బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తుల కోసం రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అలాగే వీఐపీలకు మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటుచేశారు. బందోబస్త్‌లో సుమారు 1500 మంది పాల్గొ న్నట్లు తెలుస్తోంది. కాగా, లష్కర్ జాతర సందర్భంగా ఇవాళ అమ్మవారికి బోనాలు సమర్పించగా.. రేపు సోమ వారం నాడు రంగం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్య క్రమాలు నిర్వహించనున్నారు.

**ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

ఇదిలా ఉంటే.. లష్కర్ బోనాల దృష్ట్యా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో 4వ తేదీ వరకు ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లిం పులు, ఆంక్షలు అమలు చేస్తున్నామని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. జాతర సందర్భంగా 1వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంటల నుంచి 4వ తేదీ ఉదయం వరకు పొగాకుబజార్, హమాలీ విగ్రహం నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే రహదారులు, సుభాష్‌రోడ్ , హిల్ స్ట్రీట్, అడవియ్య క్రాస్‌రోడ్స్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారి, జనరల్‌బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారిని మూసివేస్తామని చెప్పారు. ముఖ్యంగా కర్బాలా క్రాస్రోడ్స్ వద్ద చిల్డ్రన్‌పార్క్ నుంచి వచ్చే వాహనాలను రాణి గంజ్‌వైపు మళ్లిస్తారు. రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు కర్బాలా మైదాన్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు,సాధారణ వాహ నాలు రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ వద్ద మినిస్టర్ రోడ్డు , గోపాలపురం లైన్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లాలి.

## ఆహారంలో పురుగులు హాస్టల్‌లో ఉండలేమంటూ అర్ధరాత్రి గురుకులం గోడ దూకి ముగ్గురు విద్యార్థినుల పరార్



**హనుమకొండ:** ఆహారంలో పురుగులు వస్తున్నాయని.. ఇక్కడ ఉండలేమంటూ ముగ్గురు విద్యార్థినులు హాస్టల్ నుంచి పారిపోయారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని మందా రిపేట శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీవీబీ) నుంచి అర్ధరాత్రి గోడదూకి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలకలం రేపింది.శనివారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ముగ్గురు విద్యార్థినులు హాస్టల్ ప్రహరీ గోడ దాటి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పాంశాల సిబ్బంది, పోలీసులు, తల్లిదండ్రులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం గోవిందాపూర్ వెళ్లే మార్గంలోని చెట్ల పొదల్లో దాక్కున్న విద్యార్థినులను తల్లిదండ్రులు గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. హాస్టల్‌లో అందించే అల్పాహారంలో పురుగులు వస్తున్నాయని, బాత్రూంలు అపరిశుభ్రంగా ఉన్నాయని, కొద్దిసేపు ఆలస్యంగా నిద్ర లేస్తే కఠినమైన శిక్షలు విధిస్తున్నారని వాపోయారు. ఈ పరిస్థితుల్లో అక్కడ ఉండలేకనే బయటకు వచ్చామని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్, సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి ముగ్గురు విద్యార్థినులు గోడ దూకి బయటకు వెళ్తుంటే సిబ్బంది ఏం చేస్తున్నారని నిల దీశారు. హాస్టల్‌లో ఆహారం, పారిశుద్ధ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడమే నా లక్ష్యం మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ :** ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్ఎల్బీసీ సొరంగం మార్గం ద్వారా రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందజేస్తామని చెప్పుకొ చ్చారు.కంచనపల్లి గ్రామాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. దోమలపల్లి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామని తెలిపారు. మూడేళ్లు నల్గొండ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. వారానికి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## దేశంలోనే నెంబర్ వన్‌గా తెలంగాణ మీసేవ




**హైదరాబాద్:** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆన్‌లైన్‌లో ఒకే వేదిక మీద అందిస్తోన్న రాష్ట్ర మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. దీనిద్వారా శుక్రవారం ఒక్కరోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒక్కరోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అంతరాయాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌గా రాష్ట్ర మీసేవ నిలిచిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మీసేవ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను మరింతగా అభివృద్ధి చేయడం, సేవలను విస్తృత పరచడం, ఆమేరకు ప్రజల వినియోగాన్ని ప్రోత్సహించడంలో ప్రజాప్రభుత్వం చొరవ చూపిస్తోందని, దాంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రజా ఉద్యమంగా నిర్వహిద్దాం మంత్రి సీతక్క



**హైదరాబాద్:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రజా ఉద్యమంగా నిర్వ హిద్దామని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తల్లిపాల వారో త్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'తల్లి పాలే శిశువుకు తొలి హక్కు.. తొలి టీకా' అని తెలిపారు. హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు.

**బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి..**

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. మొదటి 6 నెలలు కేవలం ఈ పాలే ఇవ్వాలని సూచించారు. తల్లి పాలపై అవగాహన పెంచాలని అధికా రులను ఆదేశించారు. ఈ పాలపై ఉన్న అపోహలను తొలగిద్దామని తెలిపారు. ఆరోగ్యవంతమైన చిన్నారులే ఆరోగ్య తెలంగాణకు పునాది అని ఉద్ఘాటించారు. ప్రతి ఇంటికి 'తల్లి పాలే తొలి టీకా' సందేశం తీసుకెళ్లాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యంపై సమాజమంతా బాధ్యత తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com